# సెకండ్ హాండ్ లైఫ్

''నాన్నా! నాన్నా! సెకెండ్ హాండంటే రైట్ హాండా, లెఫ్ట్ హాండా?'' పరుగున వచ్చి గొప్ప ధర్మసందేహం వెలిబుచ్చింది హేమ.

''హవ్వ! అది కూడా తెలీదా? చెల్లాయిని మెచ్చుకుంటావుగా నాన్నా! చూడు, ఎంత గొప్ప తెలివో?'' అని నవ్వాడు వ్యంగ్యంగా పన్నెండేళ్ళ కృష్ణ.

'' ఏడ్చావులేరా, దాని వయసెంత?'' అంటూ హేమని ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు శ్రీధర్. ''చెప్పునాన్నా!'' గారాంగా అంది హేమ.

''ఫస్టంటే మొదటిదనీ, సెకెండ్ అంటే రెండోదనీ తెలుసు గదా?''

''తెలుసు, కుడి చేయి ఫస్ట్ హాండా?''

''కాదమ్మా! ఒకో భాషకో నుడికారం ఉంటుంది. దాన్నే ' ఇడియం' అంటారు ఇంగ్లీషులో. ఒక భాషని అనువదించేటప్పుడు పదం పదం విడదీసి అర్థం చెప్పుకోకూడదు. ఉదాహరణకి 'రెడ్ హాండడ్'గా పట్టుకోవటం అంటే ఎర్రచేత్తో అని కాదు - కళ్ళారా చూసి పట్టుకోవటం అని. అలాగే సెకెండ్ హాండ్ అంటే ఓ వస్తువు కొత్తది కాదు, ఇంతకు ముందు ఇంకోరి చెయ్యి దాని మీద పడ్డదీ అని,'' విపులంగా చెప్పాడు శ్రీధర్.

''ఓహో! సెకెండ్ హాండ్ బుక్కంటే ఎడం చేతి పుస్తకం కాదన్నమాట!'' అంది హేమ.

''స్వచ్ఛమైన తెలుగులో చెప్తే అర్థం కాదు దానికి, అరబ్బీలో చెప్పునాన్నా!'' అన్నాడు కృష్ణ.

''ఊరుకోరా కృష్ణా!'' అని కొడుకుని విసుక్కుని కూతురివైపు తిరిగి - ''సెకెండ్ హాండ్ బుక్కంటే ఒకరు వాడిన పుస్తకాలమ్మా! ఇంక కబుర్లు కట్టిపెట్టి చదువుకోండి'' అంటూ పక్కనున్న పేపరు చేతిలోకి తీశాడు. కళ్ళు అక్షరాలు చూస్తున్నా అతని ఆలోచనలు గతంలోకి పోయాయి.

స్కూల్లో చదివే రోజుల్లో శ్రీధర్ పొట్టిగా ఉండేవాడు. పిల్లల్ని ఎత్తుల ప్రకారం కూర్చోబెట్టటాన అతని స్థానం ముందు బెంచీలోనే. అప్పుడప్పుడు ఉపాధ్యాయులు ఒట్టి చేతులతో వచ్చి పాఠ్య పుస్తకాన్ని అడిగితే ఎంత అందుబాటులో వున్నా శ్రీధర్ ఏనాడూ తన పుస్తకమిచ్చేవాడు కాదు.

ఓసారి సుశీలాచారి టీచరు - '' మిగిలిన పిల్లలంతా పోటీలు పడి పుస్తకాలు ఇస్తారు. నువ్వు మాత్రం పక్కనే ఉండి ఇవ్వవు. ఎందుకు శ్రీధర్?'' అనడిగింది.

''నాది పాత పుస్తకం టీచర్! అక్కడక్కడా కొన్ని పేజీలుండవు. కొన్ని చిరిగిపోయి ఉంటాయి.'' సిగ్గుపడుతూ చెప్పాడు శ్రీధర్.

తన తోటి పిల్లలంతా కొత్త పుస్తకాలు తెరుస్తుంటే ముచ్చటేసేది శ్రీధర్‌కి. 'తనకీ కొత్తవి కొనీయవచ్చుగా నాన్న' అనుకునేవాడు. మూలలు ముడతలు పడీ, కొన్ని కాగితాలు చిరిగిపోయీ, కాగితాలు మాసినట్టయి అక్షరాలు మసగ్గా కనిపించే తన పుస్తకాల్ని ఒక్కోసారి విసిరికొట్టాలనిపించినా తమాయించుకునేవాడు శ్రీధర్.

పుస్తకాలే కాదు, బట్టలు కూడా దాదాపు అంతే. అన్నీ సోదర రత్నం మాధవరావు వాడినవే వారసత్వపు ఆస్తిలా శ్రీధర్‌కు సంక్రమించేవి. మాధవరావు కాస్త నిండుగా ఉండేవాడు. శ్రీధర్ అందుకు విరుద్ధంగా - బక్కపల్చగా ఉండేవాడు. ఇక ఆ దుస్తులు తగిలిస్తే అరువు తెచ్చుకున్నట్టు స్పష్టంగా తెలిసేది. నిక్కర్లు మోకాళ్ళు దిగేవి. చేతుల పొడ వెక్కువై వేళ్ళాడుతుంటే మడిచేసినా, వదులుగా వికారంగా కనిపించేవాడు, దానికి తోడు కొన్ని బట్టలకు గుండీలూడిపోయి, కుట్లూడిపోయి ఉండేవి. కొన్ని బట్టలు రంగువెలసిపోయి ఉండేవి. చాలామటుకు పిల్లలంతా అతన్నో విదూషకుణ్ణి చూసినట్టు చూసేవాళ్ళు. ఆ దుస్తులు ధరించటం ఏ మాత్రం ఇష్టం లేకపోయినా తల్లిదండ్రులకు ఎదురు చెప్పే ధైర్యం లేకా, అంతో ఇంతో ఆర్థిక స్థితిగతులు అవగతం కావటానా వేసుకునేవాడు.

కాలేజీ చదువుల కొచ్చాక ఎం.పి.సి. గ్రూపు తీసుకోవటానికి ససేమిరా అంగీకరించలేదు శ్రీధర్. లెక్కలు, సైన్సు అంటే ఇష్టంలేక కాదు. అన్న పాత పుస్తకాల బెడద తప్పించుకోవటానికి. నిజానికి మాధవరావు వాడినవీ కొత్త పుస్తకాలు కాదు, సెకెండ్ హేండ్‌వే. అవే శ్రీధర్ చేతిలో కొచ్చేసరికి థర్డ్‌హేండ్‌వయిపోయి మాసిపోయి చిరిగి ఉండేవి. 'హమ్మయ్య! దిక్కుమాలిన పాత పుస్తకాల పీడా పోయింది. ఎంచక్కా మల్లెపూలలాంటి తెల్లటి కొత్తపుస్తకాలు నన్ను వరిస్తాయి' అనుకుంటూ సి. ఇ. సి. గ్రూపు తీసుకున్నాడు శ్రీధర్. తను సెకెండ్ హేండ్ పుస్తకాలు కొనుక్కుంటూ, తమ్ముడికీ సెకెండ్ హేండ్ పుస్తకాలే తెచ్చాడు మాధవరావు. 'వీడెక్కడ దొరికాడు తనకు జీవితంలో విలన్‌లా' అనుకుని ఏం చేయలేక ఊరుకున్నాడు శ్రీధర్.

మాధవరావుకు చదువయిపోగానే వెంటనే ఉద్యోగం దొరికింది. శ్రీధర్‌కి మాత్రం బి. ఏ. అయిపోయి రెండేళ్ళయినా సరైన ఉద్యోగం దొరకలేదు. ప్రయివేటు కంపెనీల్లో తక్కువ జీతానికి పని చేస్తున్నాడు. ఇంతలో తండ్రి హఠాత్తుగా గుండెపోటు వల్ల మరణించడంతో, తండ్రి ఆఫీసులోనే కంపాసినేట్ గ్రాండ్స్‌మీద అతని కుద్యోగమిచ్చారు. అది ప్రభుత్వోద్యోగమే. మంచి జీతమూ వస్తుంది. అయితే సెకెండ్ హేండ్ ఉద్యోగంలాగే అనిపించేది శ్రీధర్‌కు.

తండ్రి పోయిన తరువాత అన్న మాధవరావు భార్యా పిల్లలతో వేరుగా ఉండసాగాడు. తల్లికీ, తనకూ అంత పెద్ద ఇల్లు ఎందుకనీ, అద్దె భరించటం కష్టమై అమీర్‌పేటలోనే వేరే చిన్న ఇంటికి

మారాడు శ్రీధర్. ఇంటివాళ్ళ అమ్మాయి కరుణ. ఆమె చక్కగా ఉండేది. బుద్ధిగా ఉండే శ్రీధర్ కూడా ఆమె ఆకర్షణలో పడిపోయాడు. కరుణ అవసరమున్నా, లేకున్నా ఆమడదూరం వినిపించేటట్లు ఏవో చమత్కారాలు మాట్లాడటం, సదా ప్రేమగీతాలు, విరహగీతాలూ, లౌడ్ స్పీకర్లా హై వాల్యూమ్‌లో పెట్టడం ఇవన్నీ తనకోసమే ననుకున్నాడు. ఆమెకి పెళ్ళి నిశ్చయమైందనీ కాబోయే శ్రీవార్ని ఊహించుకుని ఆనందోత్సాహాలతో త్రుళ్ళిపడుతోందనీ అతనికి తెలీదు.

ఇల్లు చూడటానికొచ్చిన మొదటి రోజే ఆమె అతని నాకర్షించింది. అతను తలుపు తడితే, కూనిరాగాలు తీస్తూ వచ్చి తలుపు తీసిన కరుణ ''మీరు..మీరు.. మీరా?'' అంది అతన్ని చూసి.

ఆ మీరెవరో మాత్రం అర్థం కాలేదు అతనికి. కాబోయే శ్రీవారన్న భ్రమలో ఉంది ఆమె. పెళ్ళిచూపుల్లో చూసీ చూడనట్టు చూసిన ఆమె పొరపడటంలో ఆశ్చర్యం లేదు.

ఆమె తనెవరు అనుకుంటుందో అర్థం కాని శ్రీధరూ తడబడ్డాడు.

'' ఇల్లు.. ఇల్లు.. చూద్దామని వచ్చాను'' అన్నాడతను.

'' ఇల్లా! ఏ ఇల్లూ...?'' అంది ఆమె.

''అదేనండీ 'టులెట్' బోర్డు కట్టారుగా.''

'' ఓహో, అదా...!'' అప్పుడర్థమైంది ఆమెకి. తేరుకుని ''రండి'' అని లోనికాహ్వానించింది.

ఇలా ఉండగా ఆమె పెళ్ళి అని తెలిసింది అతనికి. అతను నీరుగారిపోయాడు. తన తలరాత ఇంతే అని రాజీపడుతున్న సమయంలో అతనికి తెలిసింది కరుణ పెళ్ళి ఆగిపోయిందని. అంతా నిశ్చయమనే అనుకున్నారు. లగ్నం కూడా నిశ్చయమైంది. పెళ్ళి ఏర్పాట్లు చేసుకున్నారు. ఇంక శుభలేఖలు అచ్చేయటం ఒక్కటే తరువాయి. అప్పుడు పెళ్ళికొడుకు తండ్రినుండి దశరథరామయ్య గారికో ఉత్తరం వచ్చింది. 'తన కొడుకు ఎవరో అమ్మాయిని ప్రేమించాడనీ, ఆ పిల్లను తప్ప పెళ్ళి చేసుకోనని హఠం పట్టాడనీ, ఆ విషయం తనకూ, ఇంట్లో వాళ్ళకూ ఇప్పటివరకూ తెలియదనీ, కనుక మీతో వియ్యమందటం ఇరువర్గాలకూ శ్రేయస్కరం కాదన్న దృష్ట్యా వేరే సంబంధం చూసుకోండనీ, ఇబ్బంది కలిగిస్తున్నందుకు అన్యథా భావించవద్దనీ, క్షమించమనీ' సుదీర్ఘమైన ఉత్తరం రాశాడు.

దశరథ రామయ్యగారికి కరుణ ఆరో కూతురు. చివరిది. అయిదుగురు కూతుళ్ళకు పెళ్ళి చేసేటప్పటికే ఆయన విసిగిపోయి ఉన్నాడు. ఎన్నో సంబంధాలు చూసిన తరువాత కరుణకు ఈ సంబంధం కుదిరి, ఖాయపర్చుకున్నాడు ఆయన. కరుణ అందమైందే, చదువుకున్నదే, ఆయన కట్నం కూడా ఇవ్వగలడు. అయితే ఉద్యోగం రాలేదు. చాలామంది వెన్నెముక లేని యువకులకు అదో అయోగ్యత అయిపోయింది.

దశరథ రామయ్య గారికీ, ఆయన భార్య పార్వతమ్మకీ నడుము విరిగినట్లయింది ఆ పరిస్థితికి. వ్యవహారం మళ్ళీ మొదటికొచ్చింది. మళ్ళీ కాళ్ళరిగేట్లు తిరగాలి. సంబంధాలు వెతకాలి. వాళ్ళకి పిల్ల, కట్నం వగైరాలు నచ్చాలి. ఎంతో ఉత్సాహంగా, సంతోషంగా ఉన్న కరుణ ఉదాసీన అయిపోయింది. పార్వతమ్మ కూతురికి పెళ్ళయ్యే రాత ఉందో, లేదోనని దిగులు పడిపోయింది. అలాంటి తరుణంలో శ్రీధర్ తల్లి సరస్వతి శ్రీధర్ ప్రస్తావన తెచ్చింది.

''కరుణను నువ్వే చేసుకోరాదురా అబ్బాయి! ముచ్చటైన పిల్ల. చిదిమి దీపం పెట్టొచ్చు. నువ్వు సరేనంటే నేను వాళ్ళమ్మ గారితో మాట్లాడుతాను'' అంది.

శ్రీధర్ అంతరంగం ఆనందడోలికల్లో ఊగిసలాడింది. ఏం ఆలోచించకుండా ''సరే, నీకిష్టమయితే నాకిష్టమే'' అన్నాడు.

తల్లి పార్వతమ్మతో సూచనగా అనటం, అది ఆమెకీ, దశరథరామయ్యకీ నచ్చటంతో త్వరలోనే శ్రీధర్ పెళ్ళి కరుణతో అయిపోయింది.

శ్రీధర్ తొలి ఉత్సాహంలో, మైకంలో 'సరే' అన్నా తరువాత 'అలా ఎందుకన్నానా! అని ఆలోచనలో పడిన క్షణాలు ఉన్నాయి. మొదటి సంబంధం తప్పిపోతే, తను సెకెండ్ హాండ్ పెళ్ళికొడుకయ్యాడు. ఈ భావన భరించరానిదయ్యింది అతనికి. ఈ ఆలోచనతోనే మొదటి రోజు భార్య గదిలోకి వచ్చేటప్పటికి అతను ఎంతో ఉదాసీనంగా కనిపించాడు.

అతన్నలా చూసి ఆమె, అడగనే అడిగింది - '' ఏమిటలా ఉన్నారు?'' అని.

''ఏంలేదు'' అని తప్పించుకోజూశాడు శ్రీధర్.

''ఏంలేకేం, ఏదో ఉంది, చెప్పండి'' అంది ఆమె కొత్తపెళ్ళికూతురు సిగ్గును పక్కకు నెట్టేస్తూ.

మెల్లగా అతను చెప్పసాగాడు. తను, తన జీవితం, బట్టలు. పుస్తకాలు, చివరకు ఉద్యోగం కూడా ఎలా సెకెండ్‌హాండ్‌గా అతనికి లభించాయో! కానీ పెళ్ళి కూడా ఓ పెళ్ళికొడుకు తిరస్కరిస్తే, తాను కరుణను చేసుకోవటంలో తనకు కలిగిన ఆత్మన్యూనతను వ్యక్తపరిచాడు.

అంతా విని కరుణ పకపకా నవ్వింది.

''కాని మీరు నాకు ఫస్ట్‌హాండ్ భర్తే. మొదటిసారి మిమ్మల్ని చూసినప్పుడే ఆ 'అనుకోని అతిథి' మీరే అనుకున్నాను, మీరే అయ్యారు.''

''మరి నాకు నువ్వు?''

''భార్య వస్తువు కాదు - ఫస్టుహాండా, సెకెండ్‌హాండా అనటానికి. నేను మనిషిని. ఉత్సాహంతో, ఆనందంతో జీవితాన్ని పంచుకోవటానికొచ్చిన భార్యను. ఇక అలాంటి ఆలోచనలు కట్టిపెట్టండి'' అంది ఆమె.

ఆమె తోడి జీవితంలో అతను బాధపడింది లేదు. ఆమెకీ ఉద్యోగం వచ్చింది. డబ్బు ఇబ్బంది లేకుండా సుఖంగా, హాయిగా జీవితం గడచిపోతోంది. కాని హృదయంలో ఎక్కడో రవ్వంత ఆ భావన ముల్లులా గుచ్చుకోకుండా ఉండలేదు అతనికి.

''అంతా నిద్రపోయి కలలు కంటే, మావారు కళ్ళు తెరుచుకునే కలలు కంటారు... ఏవండోయ్, మహానుభావా!'' అంటూ కరుణ తట్టి లేపేసరికి శ్రీధర్ పని త్రుళ్ళిపడినట్టయింది.

'' ఆ... ఆ... ఎందుకోయ్, అట్లా గావుకేక పెడ్తావు?'' అన్నాడు.

''భూతాలే బెదరిపోతాయి మిమ్మల్ని చూస్తే, నేనేం భయపెట్టగల్ను కానీ,,, టిఫినేం చేయమంటారు?'' అంది కరుణ.

'' ఏమక్కరలేదు, కాఫీ పెట్టు చాలు.''

'' ఉత్త మీకోసమే కాదులే, ఉదయం ఆఫీసుకు బాక్స్ తీసుకెళ్ళలేదు. నాకూ ఆకలిగా ఉంది చెప్పండి.''

''అదేం అంత అశ్రద్ధ ఎందుకు?''

''అశ్రద్ధకాదు, ఆందోళన. ఆ బస్సులు దొరకవనే దిగులుతో ఏదీ గుర్తుండదు. ఓ స్కూటర్ కొనమంటే వినరు? మా బావగారి స్కూటర్ సంగతేం చేశారు?''

''ఛ! స్కూటరొద్దు, చెత్తగా ఉంటుంది. హీరోహోండా తీసుకో నాన్నా!'' అన్నాడు కృష్ణ పుస్తకాల్లో నుండి తలెత్తి.

'' ఒరేయ్! కృష్ణా! దృష్టి పుస్తకం మీదా, ధ్యానం మా మాటల మీదా? ఏం కొనాలో మేం ఆలోచిస్తాం కానీ, నువ్వూ చెల్లీ, గదిలో కూర్చుని చదువుకోండి... ఊఁ కదలండి'' అని కసిరింది కరుణ.

పిల్లలు ఏమనలేక లోపలి గదిలోకి పోయారు.

''నువ్వన్న సంగతి ఆలోచించాను. మా అన్నయ్యతోనూ సంప్రదించాను. ఆయనన్నారు 'మీ షడ్డకుడు కొత్త స్కూటర్ మార్కెట్ ధరకంటే తక్కువ కెందుకిస్తున్నాడు. బండిలో ఏదయినా లోపముందేమోరా! కొన్న తరువాత మళ్ళా రిపేరుకు పెట్టాలంటే కష్టం. ఆలోచించికొను' అని. ఏం చేయాలా అని సందేహంలో పడిపోయాను.''

కరుణ నాలుగో అక్క వరలక్ష్మి, ఆమె భర్త వామనరావు. వాళ్ళు ఈ మధ్యనే బజాజ్ చేతక్ కొన్నారు. పిల్ల పెళ్ళి అకస్మాత్తుగా కుదరటంతో ఆ బండిని అమ్మచూపుతున్నారు.

''అదుగో అదే నాకు నచ్చదు. మీ అన్నయ్య చెప్పగానే మీకు ఆ ఆలోచన సరైందనిపించింది. దేవుడు మనకు బుద్ధి ఇచ్చింది ఆలోచించమని. అంతేగాని ఇతర్లు - అంటే నేను కూడా -

చెప్పిందే సరైంది అనుకోవటం కాదు. నిజమే, ఆ బండిలో లోపమే ఉంది, రిపేరు చేయించరావాల్సి రావచ్చు. ఓ రెండువేలు అవసరానికి మన డబ్బు తిన్నారే అనుకోండి వాళ్ళు. మనం నష్టపోయేదెంత? అలా అనుకుంటే కొత్తదే కొనండి'' అంది కరుణ కోపంగా.

''అలా అని కాదు. మనవాళ్ళు అనుకున్న వాళ్లని సంప్రదించకపోతే ఎట్లా?'' అన్నాడు శ్రీధర్.

''సంప్రదించండి. వద్దనలేదు. వస్తువులు సెకండ్ హాండ్ అయితే పర్లేదు. ఆలోచనలు సెకండ్ హాండ్ కాకూడదు'' అంది కరుణ.

''నువ్వన్నది నిజమే. నేనూ తీసుకుందామనే నిర్ణయించుకున్నాను. పైగా సెకండ్ హాండ్ అయితేనే మనకు అచ్చొస్తుంది...''

''ఆ మాటే అనొద్దు. వట్టి సెంటిమెంట్ అది...''

''సెంటిమెంటా పాడా, అది లేకపోతే మనమిలా దగ్గరయ్యేవాళ్ళమా హానీ!'' అని చెయ్యి పట్టి లాగాడామెను అతను.

'అనుకోని అతిథి' అన్న పేరుతో 'ఆంధ్రప్రభ' సచిత్రవారపత్రిక
25-7-1990


*With best compliments from*

**Bijumalla**
**Jayaprada Srinivas**
*L.I.C. Agent, CB XXI Barkatpura*

12-10-416
Sitaramnagar
Sitaphalmandi
Secunderabad - 61

**Phone : 761 6334**